



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

బుధవారం 16 జూలై 2025 పేజీలు 11


## జినోమ్ వ్యాలీతో ప్రత్యేక గుర్తింపు

# ప్రపంచ ఫార్మా బ్రాండింగ్‌కు హైదరాబాద్

▸▸ పెట్టుబడులకు కేంద్రబిందువుగా తెలంగాణ ▸▸ సకల రాయితీలు - అనుమతులు - మౌలిక వసతులు కల్పించనున్న ప్రభుత్వం : సీఎం రేవంత్ రెడ్డి



ఫార్మా రంగంను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



ఫార్మా సంస్థ కు భూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు శ్రీధర్ బాబు,వివేక్ వెంకట స్వామి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/షామిర్ పేట,మేజర్ న్యూస్ (జూలై 15):** "పారిశ్రామిక రంగాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోంది. హైదరాబాద్‌ను ఫార్మా బ్రాండింగ్‌కు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్రం ముందడుగు వేస్తోంది" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం శామీర్‌పేట్ జినోమ్ వ్యాలీలో ఐకార్ బయాలాజిక్స్ సంస్థ కొత్త బయోటెక్ యూనిట్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పదవిలోకి రానున్న వివేక్ వెంకటస్వామి, శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద్ రెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫార్మా రంగంలో తెలంగాణ ఆధిపత్యం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ – "ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా ఉత్పత్తుల్లో భారత్ 30 శాతం వాటా కలిగి ఉంది. అందులో మెజారిటీ భాగం హైదరాబాద్ నుంచే వస్తోంది. దేశంలో తయారవుతున్న వ్యాక్సిన్లలో 33 శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం తెలంగాణ నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

మిగతా 3లో

## ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యమా... సబితా రెడ్డి

▸▸ అధికారుల తీరుపై అసహనం...వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

▸▸ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే సబితా రెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 15): బడంగ్ పేట్ కార్పొరేషన్ అధికారుల తీరుపై అసవానం వ్యక్తం చేస్తూ, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని మాజీ మంత్రి నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతలలో గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులపై కార్యాలయం నందు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులను నిలదీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, పనులు నత్తనడకన సాగితే ఎలా సాగుతుందినీ.. అన్నారు. బాధ్యతగల వైఖరిని ప్రదర్శించాలి అంటూ అధికారులను ఆమె హెచ్చరించారు. పలు ప్రాంతాలలోడ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్స్, మంచినీటి సరఫరా, ఎస్ఎన్‌డీపీ నాలా వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. నాణ్యతకు లోటుపడకుండా, వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో బడంగ్పేట్ మున్సిపల్ కమిషనర్ సరస్వతి,డి ఈ వెంకన్న, ఏ ఈ హరీష్, ఏ ఓ అరుణ, టీ పీ ఓ కిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్లు వినయ్, సంపత్, రాకేష్, కళ్యాణ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ నాగేశ్వరరావు తో పాటు ఇతర శాఖల అధికారులు, పాల్గొన్నారు.

### అక్రమ మైనింగ్ , ఇసుక రవాణా జరుగుతున్నా

## ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు

▸▸ అధికారుల మౌనంపై ఎంపీ కొండా ఆగ్రహం

▸▸ తాండూరు రోడ్ల దుస్థితిపై అధికారులను ప్రశ్నించిన ఎంపీ

▸▸ జిల్లాలోని పలు సమస్యలపై కలెక్టర్‌ను ప్రశ్నించిన ఎంపి

▸▸ ఇసుక మాఫియాను ఎందుకు అరికట్టడం లేదు

▸▸ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలా చూడాలి

▸▸ చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ▸▸ హాట్ హాట్‌గా దిశ సమావేశం ▸▸ ప్రతి శాఖపై క్షుణ్ణంగా సమీక్షించిన ఎంపీ

5 లో



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూలై15): చేవెళ్ల ఎంపి,పార్లమెంట్ చీఫ్‌విఫ్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ( దిశ) కమిటీ సమావేశం హాట్ హాట్‌గా జరిగింది.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠినమైన చర్యలు తీసుకుంటాం

### అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి



తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( జులై 15) : చెరువులు, కుంటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్మెట్ మండల తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ సర్వే నెంబర్ 141లోని పిట్టల చెరువు ఎఫ్ టి ఎల్ లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గుర్తించిన అబ్దుల్లాపూర్మెట్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.

మిగతా 2లో

## చీకట్లో అంబేడ్కరుడు...

▸▸ కీసర ప్రధాన చౌరస్తా మొత్తం చిమ్మ చీకటి ▸▸ రాత్రి సమయాల్లో ఎపుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయం ▸▸ దుకాణదారుల పుణ్యమాని ఆ కాసింత వెలుగు

▸▸ సమస్య పరిష్కరించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్న కీసరవాసులు



**కీసర,మేజర్ న్యూస్,(జులై 15):** ప్రపంచంలోనే భారతదేశానికి ఓ వెలుగును తీసుకువచ్చిన భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ నేడు అధికారుల నిర్లక్ష్యంకు కీసరలో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

మిగతా 3లో

# బ్రతుకుదెరువుకై వలసవచ్చిన దళిత కూలీపై మాడ్గుల పోలీసుల జులుం

▶▶ ఫిరోజ్‌నగర్ సమీపంలోని భూమిలో కంటైనర్ ఎవరు ఏర్పాటుచేశారని, ఇక్కడ ఎందుకు వుంటున్నారంటూ సి.ఐ, ఎస్.ఐలు అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై చేయిచేసుకున్నట్లు బాధిత కూలి వెంకన్న ఆరోపణ ▶▶ కోర్టు పరిధిలోని ఉన్న భూమిలో అక్రమంగా ఏర్పాటుచేసిన కంటైనర్‌పై విచారణకు వెళ్ళాం.. ఎవరిపై చేయిచేసుకోలేదు : మాడ్గుల సి.ఐ వేణుగోపాల్ వివరణ





మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూలై 15):బ్రతుకుదెరువు కొరకు మాడ్గుల మండలం నాగిల్ల రెవెన్యూ శివారు పరిధిలోని ఫిరోజ్‌నగర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి వలసవచ్చిన నిరుపేద దళిత కూలీపై మాడ్గుల పోలీసులు జులుం ప్రదర్శించి చేయిచేసుకోవడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించినట్లు సదరు కూలీ దంపతులు వాపోయారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన తాము మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పొలం పనులు చేయడానికి గత 5నెలల క్రితం వలసవచ్చి ఊరిని ఆనుకొని ఉన్న భూమిలో గల కంటైనర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అయితే మంగళవారం మధ్యాహ్నం మాడ్గుల పోలీసులు మా కంటైనర్ వద్దకు వచ్చి కోర్టు నుండి విచారణ చెయ్యమని ఆదేశాలు వచ్చాయని, నీవు ఎవరు, ఇక్కడ ఎందుకు వుంటున్నావ్, నీ కులం ఏది అని అడుగడంతో ఫిరోజ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద పొలం పనులు చేయడానికి పేద కుటుంబానికి చెందిన నేను, నాభార్య సూర్యపేట జిల్లా నుండి వచ్చామని, గ్రామస్థులు మమ్మల్ని కంటైనర్‌లో నివాసం ఉండమని చెప్పారని తాను పోలీసులకు బదులిచ్చినట్లు సదరు కూలీ వెంకన్న వివరించారు. దీంతో సి.ఐ వేణుగోపాల్, ఎస్.ఐ రాఘువేందర్‌లు ఇద్దరు ఆగ్రహంతో ఊగిపోతూ తనను అసభ్య పదజాలంతో దూషించి మూడుసార్లు తనచెంపపై కొట్టినట్లు బాధిత కూలీ వెంకన్న వాపోయాడు. కాగా ఈ విషయమై మాడ్గుల సి.ఐ వేణుగోపాల్‌ను మేజర్‌న్యూస్ ఫోన్‌ద్వారా వివరణ కోరగా ఫిరోజ్‌నగర్ గ్రామ శివారులో కోర్టు పరిధిలో ఉన్న భూమిలో కంటైనర్ ఏర్పాటు గురించి విచారణకు వెళ్ళినమాట వాస్తవమేనని, కంటైనర్ ఎవరు ఏర్పాటుచేశారని, ఇక్కడ ఎందుకు ఉంటున్నారని అందులో నివాసం ఉంటున్నవారిని అడిగి విచారణకు సహకరించాలని కోరామే తప్ప మేము ఎవరిపై చేయిచేసుకోలేదని తెలిపారు. ఇదిలా ఉండగా నాగిల్ల రెవెన్యూ ఫిరోజ్‌నగర్ గ్రామశివారు సర్వే నెంబర్ 476లో ఉన్న 180 ఎకరాల 3 గుంటల భూమిపై గ్రామస్థులు, అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబీకుల మధ్య గత 5యేండ్ల కాలంగా వివాదం చోటుచేసుకొని ఇరువర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలో గత మూడు నెలల కిందట ఈ భూమిపై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ స్టేటస్ కో జారీ చేయడంతో ఇరువ ర్గాల వారు ఈ భూమిలోకి వెళ్ళడం లేదని స్థానికులు తెలిపారు. కాగా ఆర్డీఓ స్టేటస్ జారీ చేయకముందే ఇదే భూమిలో కొందరు గ్రామస్థులు ఏర్పాటుచేసిన కంటైనర్‌లో నివాసం ఉంటున్న బ్రతుకుదెరువు కొరకు వచ్చిన నిరుపేద కూలీలపై పోలీసులు జులుం ప్రదర్శించి చేయిచేసుకోవడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొంటున్నారు. అదే విధంగా తనపై చేయిచేసుకొని అసభ్య పదజాలంతో దూషించిన మాడ్గుల సి.ఐ, ఎస్.ఐలపై చర్యలకు ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర మానవహక్కుల కమీషన్‌ను ఆశ్రయించనున్నట్లు బాధిత కూలీ దంపతులు వివరించారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జులై 15) : సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి. సూచించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని సంవత్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందవచ్చు అని చెప్పారు .18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులైన వారికి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలోసంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హుల ని ఆయన తెలిపారు, ఫిషింగ్ కాల్స్ ద్వారా ,సేవింగ్ కాల్స్ ద్వారా, ఆన్లైన్ ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. బ్యాంకు నుండి ఎలాంటి ఓటీపీలు ,సివివి నెంబర్లు అడిగే అవకాశం ఉండదని బ్యాంకు ఖాతా దారులకు సూచించారు. తెలియని వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930 కి కాల్ చేసి తెలపాలని బ్యాంక్ మేనేజర్ కోరారు.

## రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు :మాజీ కౌన్సిలర్ ఉషారాణి



గండిపేట్ మేజర్ న్యూస్( జులై 15)రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు అని నార్సింగ్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉషారాణి వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల ప్రజల శ్రేయస్సు కొరకు విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నదని వెల్లడించారు. ఇందులో ముఖ్యమైనవిదేశంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. 5.6 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు . 26 లక్షల మంది పేర్లను కొత్త రేషన్ కార్డులో నమోదు చేయడం గొప్ప విషయమని అన్నారు. గతంలో రేషన్ కార్డులను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని మరల 10 సంవత్సరాల తర్వాత కూడా రేషన్ కార్డులను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. అందుకే పేద ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42% శాతం రిజర్వేషన్లు ఇచ్చి రాజ్యాధికారం కల్పించింది ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక భారాన్ని తగ్గించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారని అన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠినమైన చర్యలు తీసుకుంటాం

**మొదటిపేజీ తరువాయి...** ఈ సందర్భంగా తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కోహెడ పిట్టల చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో కొందరు వ్యక్తులు ఆక్రమణలు చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఆక్రమ ప్రహరీలను కూల్చివేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన, ఎఫ్ టి ఎల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారు ఎంతటి వారైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఆక్రమణలు జరిగిన తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని ఆయ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఇంద్రాణి,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**విలేకర్లమంటూ లారీ డ్రైవరును బెదిరించిన ఐదుగురిపై కేసు నమోదు**

కొందర్గు, మేజర్ న్యూస్ ( జూలై 15) : విలేకర్లమంటూ ఓ లారీ డ్రైవర్ పై బెదిరింపులకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదైన ఘటన కొందుర్గు మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం స్థానిక ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల మెరకు షాద్‌నగర్ నియోజకవర్గంలో ఓపత్రికల్లో పని చేస్తున్న బైరమోని మహేష్(జ్యోతి), సాయినాథ్ రెడ్డి(ఆర్ టివి ), కృష్ణ (పోలీస్‌నిఘ), జగన్(3టివి ), రవి( నమస్తే), ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు.



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూలై 15):శ్రీరామ కాలనీలో బోనాల సందర్భంగా మాజీ ఎంపీటీసీ కపిల్ గౌడ్, జల్ పల్లి బిజెపి అధ్యక్షులు మనోజ్ తో కలిసి బోనాల ఉత్సవాలలో యువకుడు ప్రజ్వల్.

## జర్నలిస్టులపై దాడులను సహించేది లేదు

– టిడబ్ల్యుజెఎఫ్ ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దర్వ్యాల శంకర్



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూలై 15): ప్రజలు, ప్రభుత్వాలకు మధ్య వారధిలా పనిచేస్తూ చీకటి కోణాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై రోజురోజుకు అల్లరిమూకలు, అసాంఘీకశక్తుల ఆగడాలు, దాడులు పెరుగుతున్నాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దర్వ్యాల శంకర్ అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ పాత్రికేయులు ఖాజాపాష వాహనంపై గుర్తుతెలియని దుండగులు దాడిచేసి వాహనాన్ని ధ్వంసం చేయడాన్ని శంకర్ తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై కొంతమంది కావాలనే దాడులకు పాల్పడుతున్నారని అలాంటి దాడులను ప్రభుత్వం ప్రోత్సహించకుండ తక్షణమే కఠినవైఖరి అవలంభించాలని డిమాండ్ చేశారు. సమాజ హితం కొరకు పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అవివేకమని, ఖాజాపాష వాహనాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని శంకర్ కోరారు.

## బాధిత కుటుంబానికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూలై 15): మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అల్లి బుచ్చయ్య గతకొంత కాలంగా అనారోగ్యంతో బాదపడుతూ హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అల్లి బుచ్చయ్యకు ప్రభుత్వం ద్వారా వైద్య ఖర్చులు మంజూరుచేయించాలని మాడ్గుల మాజీ జడ్‌పిటిసి గౌరవరం ప్రభాకర్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నపించడంతో స్పందించిన ఎమ్మెల్యే బాధితుడితో ముఖ్యమంత్రి సహాయనిధికి దరకాస్తు చేయించినట్లు అప్పారెడ్డిపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుతల వెంకటయ్యగౌడ్ తెలిపారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అల్లి బుచ్చయ్యకు మంజూరైన 40వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును మంగళవారం మాజీ జడ్‌పిటిసి గౌరవరం ప్రభాకర్‌రెడ్డి నివాసంలో గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబీకులకు అందజేయడం జరిగిందని ఆయన వివరించారు.

## పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేయవద్దు : శంషాబాద్ డిసిపి బి. రాజేష్



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (జులై 15) : శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందేలా పనిచేస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేయవద్దని శంషాబాద్ డిసిపి బి రాజేష్ తలకొండపల్లి పోలీసులకు సూచించారు. తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ డిసిపి బి. రాజేష్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేష న్‌లో రికార్డులను పరిశీలించి స్టేషన్‌లో కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పరిసరాల స్వచ్ఛతను పరిశీ లించారు. పోలీస్ స్టేషన్‌రు వచ్చే ఫిర్యాదుదారులను ఎలా రిసీవ్ చేసుకుంటున్నారు, రికార్డ్‌లను ఎలా మెయింటేన్ చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేయవద్దని, ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌న్ తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో పచ్చదనం పెంపొందించుకో వాలని సూచించారు. తలకొండపల్లి స్టేషన్ పనితీరు బాగందని డీసీపీ రాజేష్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి, ఎస్సైలు ఎ.శ్రీకాంత్, కె. శేఖర్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జినోమ్ వ్యాలీతో ప్రత్యేక గుర్తింపు

# ప్రపంచ ఫార్మా బ్రాండింగ్‌కు హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి... కోవిడ్ సమయంలో జినోమ్ వ్యాలీ నుంచి వందకు పైగా దేశాలకు వ్యాక్సిన్లు పంపడం రాష్ట్ర గర్వకారణం" అన్నారు.

**ప్రోత్సాహకాలకు ప్రాధాన్యత**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుమతుల మంజూరు, భూకేటాయింపు, మౌలిక వసతులు, రాయితీలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు.

"లారస్ ల్యాబ్స్, కర్ణ ల్యాబ్స్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే 300 ఎకరాల్లో రూ.72 వేల కోట్లతో పరిశ్రమల ఏర్పాటు చేపట్టి వేల మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చాయి" అని వివరించారు.

**వ్యూహాత్మక ఆర్థిక లక్ష్యాలు**

"2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరాలన్న లక్ష్యంలో, తెలంగాణ నుంచి రూ.3 ట్రిలియన్ డాలర్ల కంట్రిబ్యూషన్ ఉండేలా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. హైదరాబాద్‌ను డేటా సిటీగా అభివృద్ధి చేసి, తెలంగాణను పారిశ్రామిక పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నాం," అన్నారు.

**పెట్టుబడిదారులకు సీఎం పిలుపు**

"తెలంగాణ పారిశ్రామిక రంగం పురోగతి పథంలో ఉంది. పరిశ్రమలు పెట్టండి, ప్రభుత్వ పరంగా పూర్తి మద్దతు ఉంటుంది. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సరళమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు ఇవన్నీ మీ కోసం సిద్ధంగా ఉన్నాయి" అంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

**ప్రత్యేక ఆకర్షణలు**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ సంస్థ లోగోను ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెంకట స్వామి ఐకార్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి భారీగా హాజరయ్యారు.



ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్ భూమిపూజకు విచ్చేసిన, సీఎంకు స్వాగతం పలుకుతున్న.. కలెక్టర్ మను చౌదరీ

# పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు భవిష్యత్తును మలుచుకోవాలి : కలెక్టర్ మను చౌదరి

● తుర్కపల్లి బీసీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల-జూనియర్ కాలేజీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ ● విద్యార్థులతో ప్రత్యక్ష సంభాషణ ● సమస్యలపై తక్షణ చర్యలకు ఆదేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్( జూలై 15): విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు జూనియర్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును సమీక్షించారు. కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించారు. యూనిఫాంలు, నోట్‌బుక్స్ అందరికీ వచ్చాయా? భోజనం బాగున్నదా? చదువులో ఇబ్బందులు ఉన్నాయా? అనే అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సబ్జెక్టులు అర్థమవుతున్నాయా? ఏవైనా కష్టంగా ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటి సరఫరాలో అంతరాయం, డోర్లు, ఫ్యాన్లు పాడవ్వడం, భోజన ఏర్పాట్లు సరిగా లేకపోవడం వంటి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ -వాటర్ ట్యాంక్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని,టిఫిన్, భోజనం తయారీకి కావాల్సిన





సామాగ్రీను కోనుగోలు చేయాలని,పాడైన డోర్లు, ఫ్యాన్లు వెంటనే రిపేర్ చేసి వాడకంలోకి తేవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ప్రభుత్వ మెనూను అనుసరించి విద్యార్థులకు ఆహారాన్ని అందించాలన్నారు. వంటగది పరిశుభ్రత, శానిటేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. దోమలు, ఈగలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని, బియ్యం, కూరగాయలు బాగా కడగాలని, వంట తీరు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు కష్టంగా అనిపించే సబ్జెక్టులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తరగతుల్లో బోధన సరళి విద్యార్థులకు అర్థమయ్యే లా ఉండాలన్నారు. విద్యార్థుల సంతులిత అభివృద్ధికి క్రీడలు కూడా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాదగిరి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు హాజరైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారసింగ్ నాయక్...

పెద్దేముల్, మేజర్ న్యూస్ (జూలై 15): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మాజీ జడ్పీటీసీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారసింగ్ నాయక్ విచారణ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత శాసన సభ ఎన్నికల్లో తన ఫోన్ ట్యాప్ అయిందని పోలీసులు నిర్ధారణ చేసి కేసు వ్యవహారానికి సంబంధించిన పలు విషయాలు అడిగినట్లు వెల్లడించారు. కేసు విచారణ భాగంగా ఎప్పుడు పిలిచిన పోలీసులకు సహకరిస్తానని తెలిపారు.





## చీకట్లో అంబేద్కరుడు...

మొదటిపేజీ తరువాయి... కీసర మండల కేంద్రంగా ఉన్న కీసర గ్రామంను దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ నుండి కీసర అంబేద్కర్ చౌరస్తాను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఘట్కేసర్, మేడ్చల్, కుషాయిగూడ, కీసర గుట్ట, యాదగిరిగుట్టకు వెళ్లాలంటే కీసర అంబేద్కర్ చౌరస్తానే ప్రధానమైంది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ చౌరస్తా రాత్రి అయిందంటే చాలు అంతా చిమ్మచీకటే. చౌరస్తా నలువైపుల చిరువ్యా పారస్తులు, దుకాణదారుల లైట్స్ ఉన్నాయి కాబట్టి కాస్తంత వెలుగు లేకుంటే ఇక అంతే సంగతనే చెప్పుకోవచ్చు.



**లిచౌరస్తాలో సిసి కెమెరాలు ఉన్న సరిపడ వెలుతురు ఎక్కడ....**

నిత్యం రద్దీగా ఉండే కీసర అంబేద్కర్ చౌరస్తాలో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కీసర పోలీసులు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటికి సరిపడ వెలుతురు లేకుండా పోవడంతో ప్రమాదాలు జరిగినపుడు పోలీసులు నింధితులను గుర్తించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో వేగంగా వచ్చిన వాహనాలు రాత్రి సమయాల్లో ఎపుడు ఎం ప్రమాదం చేస్తారోనన్ని కీసర గ్రామస్థులు భయాందోనలకు గురవుతున్నారు.

**లికమిషనర్ సార్ మీరే మాకు దిక్కు..**

దమ్మాయిగూడ మున్సిపల్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ సార్ మీరే మా ప్రధాన చౌరస్తా సమస్య పరిష్కారం చూపాలని కీసర గ్రామస్థులు కోరుకుంటున్నారు. ఇక్కడ గతంలో పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు చేపట్టిన మీకు గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని అందులో చీకట్లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంను ప్రధాన కూడలిని వెలుగులోకి తీసుకురావడం మీతోనే సాధ్యపడుతుందని కీసర గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని...

### పరిగి మండలం యాబాజి గూడ గ్రామంలో ఘటన...



పరిగి. మేజర్ న్యూస్ (జూలై 15) పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరిగి మండలం యాబాజి గూడ గ్రామంలో చోటు చేసుకుంది. పరిగి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం యాబాజి గూడ గ్రామానికి చెందిన రంగగళ్ళ పద్మమ్మ రెండవ కూతురు (నవేంద్ర 15) పాలమాకుల కస్తూర్బా గాంధీ పాఠశాల లో పదవ తరగతి చదువుతుంది. స్కూల్ రీ ఓపెన్ అయ్యాక తల్లి పాఠశాలకు పంపిస్తే వెళ్ళను అని ఇంటికి వస్తాను అని ఏడుస్తూ ఉంటే తల్లి ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 14న దోమ మండలం బాసుపల్లి గ్రామంలో తల్లి మేనమామ కొడుకు దినవారాలు ఉండటంతో పిల్లలను ఇంటిదగ్గరే ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చే వరకు ఇంటిదగ్గర రేకుల షెడ్డులో చీరతో నవేంద్ర ఉరివేసుకుని వేలాడుతున్నట్లు కనిపించడంతో తమ్ముడికి ఇతరులకు తల్లి సమాచారం ఇచ్చింది. నవేంద్ర మృతి పై గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తరచూ హాస్టల్ దగ్గరకు వెళ్తున్నట్లు తెలిసిందని లేదంటే హాస్టల్ కు వెళ్లడానికి ఇష్టం లేక మనస్థాపానికి గురై ఉండవచ్చని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న బాలిక.

# యాదయ్య గౌడ్ సేవలు మరువలేనివి : తూళ్ళ దేవేందర్ గౌడ్




## యాదయ్యగౌడ్ విగ్రహన్ని ఆవిష్కరించిన దేవేందర్‌గౌడ్



మహేశ్వరం,మేజర్‌న్యూస్(జూలై150: సమాజాభివృద్ధిలో డా తూళ్ళ యాదయ్య గౌడ్ యొక్క సేవలు మరువలేనివని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోంమంత్రి తూళ్ళ దేవేందర్ గౌడ్ పేర్కోన్నారు. మంగళవారం మహేశ్వరం గేట్ వద్ద మహాత్మా జ్యోతి రావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో తూళ్ళ యాదయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా డా తూళ్ళ యాదయ్య గౌడ్ విగ్రహాన్ని తూళ్ళ దేవేందర్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తూళ్ళ దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ యాదయ్య గౌడ్ ఎంజెపిటిబిసిడబ్ల్యూకు 10 ఎకరాల భూమికేటాయించి ఎంతో మందికి విద్య బుద్దులు నేర్పించిన మహానీయుడని, చేసిన సేవ కారణంగా నేటికీ ఈ ప్రాంత వాసులు నిరంతరం యాదయ్యను గుర్తుకు చేసుకుంటారని ఆయన అన్నారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకొని అన్ని రంగాలలో రాణించాలని తూళ్ళ దేవేందర్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో డా. తూళ్ళ యాదయ్య గౌడ్ సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు తూళ్ళ కిషోర్, తూళ్ల అశోక్‌గౌడ్, విజయేందర్‌గౌడ్,వినేయేందర్ గౌడ్,వీరేందర్ గౌడ్ ,పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్య ఉపాధ్యాయులు,విద్యార్ధుల తల్లిదండ్రులు తదితరులు పాల్గోన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



మణికొండ, మేజర్ న్యూస్ (జూలై 15)ః మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడకు చెందిన విజయ్‌కుమార్ అనారోగ్యంతో భాదపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకొగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆద్వర్యంలో చెక్కును విడుదల చేయగా మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రామక్రిష్ణారెడ్డి భాదితునికి మంగళవారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బుదొళ్ల శ్రీరాములు, నాయకులు శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా వుండాలి

## బుగ్గోనిగూడ ఎల్లమ్మ దేవాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సర్వోత్తమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



నందిగామ, మేజర్‌న్యూస్ (జూలై 15):ఎల్లమ్మ దేవత అనుగ్రహం చేకూరి ప్రజలంతా సుభిక్షంగా వుండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త సర్వోత్తమ్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజా శ్రేయస్సును కాంక్షించి ఎల్లమ్మ దేవాలయంతో పాటు గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం వుంటుందని ఆయన పేర్కొన్నారు. నందిగామ మండలం బుగ్గోనిగూడ గ్రామ సమీపంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం మాజీ సర్పంచ్‌లు, సింగిల్‌విండో డైరెక్టర్, నాయకులు, భక్తులతో కలిసి పారిశ్రామికవేత్త సర్వోత్తమ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు ఆరంభమై నెలరోజులు గడుస్తున్నా నేటికి సరైన వర్షాలు లేక రైతులు అనేక వ్యయప్రయాసలకోర్చి సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయని, ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నందున అమ్మవారి కటాక్షం కొరకు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ దేవత అనుగ్రహించి సకాలంలో వర్షాలు కురిపించి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని సర్వోత్తమ్‌రెడ్డి కోరుకున్నారు. ఈ కార్యక్మంలో బుగ్గోనిగూడ మాజీ సర్పంచ్ బండి నీలమ్మరాజు దంపతులు, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ గోవింద్ అశోక్, సింగిల్‌విండో డైరెక్టర్ మల్లేష్ దంపతులు, చేగూరు సింగిల్‌విండో చైర్మన్ జి.అశోక్, నాయకులు పబ్బేశేఖర్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థి జోత్స్నకి ఆర్థిక సాయం...



మణికొండ, మేజర్ న్యూస్ (జూలై 15)ః మణికొండ మున్సిపల్‌లోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన జ్యోత్స్న ఇంటర్‌మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ సాధించి ఎంసెట్ పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 964వ ర్యాంక్ సాధించింది. దీంతో మియాపూర్‌లోని ప్రముఖ వివిఎన్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉచితంగా ఇంజనీరింగ్ సీటు రావడంతో విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం మాజీ ఫ్లోర్ లీడర్ రామక్రిష్ణారెడ్డి తక్షణ సాయంగా 25వేల ఆర్థిక సాయంగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసి విద్యార్ధులను ఉన్నతంగా తీర్చి దిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ కమిటి డైరెక్టర్ లక్ష్మి శ్రీ, నాయకులు శ్రవణ్‌కుమార్, భానుచందర్ పాల్గొన్నారు.

# ఎదిర గ్రామపంచాయతీ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమం విజయవంతం



జిల్లేడు- చౌదరి గూడెం: మేజర్ న్యూస్:(జూలై:15): మండల పరిధిలోని ఎదిర గ్రామములో మంగళవారం నాడు స్థానిక ఎం పి డి ఓ. వి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బాగంగా ఆ గ్రామ రైతుల పొలాలలో హార్టకల్చరల్ విభాగంలో ఈ త చెట్లు, మునగచెట్లు, అయిల్ ఫాం, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రు ట్. మొదలగు చెట్లను ఎలా పెంచుకోవాలని ఎం పి డి ఓ ఈ రోజు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని సూచనలు హార్టకల్చరల్ వారితో అవగాహన చేశారు. ఈ చెట్లకు గుంతలు మహాత్మా గాంధి జాతీయ ఉపాధి హామీ పథకం లో గుంతలు తీయటం జరిగిందని ఎం పి డి ఓ. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ ఏ. వినోద్ కుమార్, ఈ సి. లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాండురంగ ము, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, రైతులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఘటాల ఊరేగింపు



అమ్మవారి తోట్టెల ఊరేగింపు నిర్వహిస్తున్న రామ్ దత్త కల్చరల్ యూత్ అసోసియేషన్ సభ్యులు.



శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ కపిల్ గౌడ్.జల్ పల్లి బిజెపి అధ్యక్షులు మనోజ్ కుమార్.



ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న జల్ పల్లి కాంగ్రెస్ కో ఆర్డినేటర్ షేక్ జహంగీర్,మాజీ కౌన్సిలర్ కే లక్ష్మీనారాయణ.

జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూలై 15):ఆషాఢ మాసం బోనాల సందర్భంగా జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని యువకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని యువకులు అమ్మవారి తోట్టెల ఊరేగింపును సాంస్కృతిక సంప్రదాయాలు, డప్పు చప్పుళ్ళు, ఆటపాటలతో ఎంతో వైభవంగా నిర్వహించారు.అమ్మవారి తోట్టెల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.




యంగ్ ఇండియన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి తొట్టెల ఊరేగింపు.

# కురుమలు సామాజిక, ఆర్థిక రంగాలలో రాణించాలి

- కురుమ సంఘం గౌరవ అధ్యక్షులు ఎగ్గిడి సత్తయ్య
- కురుమ సంఘం మండల అధ్యక్షులుగా అచ్చన పాండు కురుమ



కందుకూరు, మేజర్‌న్యూస్(జూలై 15): కురుమలు సామాజిక, ఆర్థికంగా ఎదగాలని కురుమ సంఘం మండ ల గౌరవ అధ్యక్షులు ఎగ్గిడి సత్తయ్య అన్నారు. మంగళవారం మండల కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అచ్చన పాండు ( ఆకులమైలారం),ప్రధానకార్యదర్శి సిద్దాల శ్రీనివాస్(ముచ్చర్ల)లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ...కురుమల అభివృద్దికోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని నీతినిజాయితికి మారు పేరు కురుమలు ఉంటారని గుర్తు చేశారు. అన్ని రంగాలలో రాణించినప్పుడే మనుగడ సాధిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో బండ అంజనేయులు,ఎగ్గిడి చిన్న ఐలయ్య, బక్క మల్లేష్, గౌర ప్రభాకర్,బండ నర్సింహ,సరికొండ జగన్, ఎగ్గిడి కృష్ణ, ఏకుల మహేందర్, మోటే జంగయ్య, ఎమ్మిడి జంగయ్య, దొడ్డికృష్ణ, ఏకుల మల్లేష్, దేవయ్య, మోటే రమేష్, శేఖర్,నర్సింహ,కందాడి శ్రీరామ్, ఎగ్గిడి జగదీష్, సత్యం, కృష్ణ, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్ , ఇసుక రవాణా జరుగుతున్న

# ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

● అధికారుల మౌనంపై ఎంపీ కొండ ఆగ్రహం ● తాండూరు రోడ్ల దుస్థితిపై అధికారులను ప్రశ్నించిన ఎంపీ ● జిల్లాలోని పలు సమస్యలపై కలెక్టర్ ను ప్రశ్నించిన ఎంపి ● ఇసుక మాఫియాను ఎందుకు అరికట్టడం లేదు ● కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలా చూడాలి ● చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ● హాట్ హాట్‌గా దిశ సమావేశం ● ప్రతి శాఖపై క్షుణ్ణంగా సమీక్షించిన ఎంపీ



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కొండా..

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్(జూలై15):** చేవెళ్ల ఎంపి,పార్లమెంట్ చీఫ్‌విఫ్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ( దిశ) కమిటీ సమావేశం హాట్ హాట్‌గా జరిగింది. ఈ సందర్బంగా ఆయన విద్య, వైద్య గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం,గ్రామీణ అభివృద్ధి, బ్యాంకర్లు, పంచాయతీ రాజ్,శిశు సంక్షేమం,పౌర సరఫరాలు, పరిశ్రమలు, పశు సంవర్ధ క, వెటర్నరీ, మిషన్ బగీరథ, రూరల్ వాటర్ సప్లై, నేషనల్ హై వే, గృహ నిర్మాణ శాఖ, మార్కెటింగ్, అటవీ,ఇరిగేషన్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ ల అధికారులతో వారు చేపట్టిన పనులపై సమీక్షించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై ఎంపి కొండా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విస్వనీయ సమాచారం. జిల్లాలో ప్రధానంగా తాండూరు నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక రవాణా,అక్రమంగా మైనింగ్ జరుగుతున్న ఏందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.తాండూరు నియోజకవర్గంలోని రోడ్లపై ఒక్క సారి మీరూ ప్రయాణం చేయండని ఆయన అధికారులపై మండిపడ్డారు.అదే విధంగా పరిగి నియోజకవర్గంలోని పూడూరు మండలంలో వెంచర్లలో కబ్జాకు గురైన నాలాలను గుర్తించి పునరుద్దరణ చేయాలని ఆదేశించారు.మైనింగ్‌పై ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఎంపి ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రతి శాఖపై క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్బంగా చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.....కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు.బ్యాంకర్లు జిల్లాలో కేటాయించిన లక్ష్యం మేరకు అన్ని రంగాలకు విరివిగా రుణాలను అందించాలన్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిష్కరించే విధంగా పంట రుణాలు, ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు విరివిగా రుణాలు అందించాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి క్రింద జిల్లాలో 1,86 ,179 లక్షల జాబ్ కార్డ్ లు జారీ చేయడం జరిగిందన్నారు. గత మూడు మాసాలుగా ఉపాధి హామీ పథకం కింద పని దినాలు కల్పించి రోజుకు రూ. 307/- రూపాయల చొప్పున మొత్తం 91.83 కోట్ల రూపాయలను కూలీలకు దినసరి భత్యం అందించడం జరుగుతుందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వన మహోత్సవం కార్యక్రమం క్రింద నర్సరీలు, ప్లాంటింగ్, ఫిట్టింగ్, మెయింటెనెన్స్ తదితర పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేగాక జిల్లాలో3815 మందికి వృద్ధాప్య,వితంతు తదితర పెన్షన్లు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో మహిళా శక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నిధులతో వ్యవసాయ శాఖలో ఒక లక్షా అరవై వేల మంది రైతులను గుర్తించి 490 కోట్ల రూపాయలు పి ఎం కిసాన్ క్రింద అందించడం జరిగిందన్నారు. సరిపోను యూరియా అందుబాటులో ఉందన్నారు.పంట పొలాల మట్టి నమూనాల సేకరించి సాయిల్ హెల్త్ క్రింద హెల్త్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఎన్ సి డి కార్యక్రమం కింద మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం జరుగుతుందని, జిల్లాలో 223 పి హెచ్ సి లు, 104 పల్లె దవఖానాలు ద్వారా ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 19 కేజీబీవీ పాఠశాలల్లో 6154 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో 74% ఫలితాలను సాధించినట్లు తెలిపారు.అన్ని పాఠశాలల్లో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం క్రింద నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం లను అందించడం జరిగిందని తెలియజేశారు. శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాలలో అవసరమైన మరమ్మతులు పూర్తి అయ్యాయని, అలాగే మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 594 గ్రామపంచాయతీలు, హాబిడేషన్ లకు ఇంటింటికి నల్లాల ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరును అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన బోరుబావులను మరమ్మతులు చేయించి నీటిని అందించినట్లు ఆయన తెలిపారు.ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన కింద పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో ప్రతిపాదించిన లక్ష్యాలను సాధించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే దిశగా పనిచేయాలని అన్నారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ....కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చెవెళ్ల పార్లమెంట్ సభ్యులు సంరక్షిస్తున్నారని తెలిపారు.జిల్లాలో మొత్తం 25 శాఖలు చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించడం జరుగుతుందన్నారు.జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ డి ఎ శ్రీనివాస్,దిశ కమిటీ సభ్యులు అంతారం లలిత, మిట్ట పరమేశ్వర్ రెడ్డి, వడ్ల నందు, జానకిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దిశ సమావేశంలో పాల్గొన్న అధికారులు.

## తాండూరు ఎమ్మెల్యే సహకారంతో అన్ని వార్డులల్లో జోరుగా అభివృద్ధి పనులు...

● ప్రత్యేక నిధులు తెస్తున్న ఎమ్మెల్యే

● మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి వెల్లడి

**తాండూరు,మేజర్ న్యూస్(జూలై 15):** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ,కృషి ఫలితంగా తాండూరు పట్టణ అభివృద్ధి కోసం ఎన్నో నిధులు తెస్తున్నారని,ఆయన కృషి ఫలితంగానే ప్రతి వార్డులల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి పేర్కొన్నారు.తాండూరు పట్టణంలోని 11 వ వార్డులో మంగళవారం నాడు 15 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అభివృద్ధి పనుల విషయంలో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు.ఎమెల్యే అందిస్తున్న ప్రోత్సాహం మూలంగా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బంటు మల్లప్ప,తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న బాల్ రెడ్డి.

## మెడికల్ ఆఫీసర్ పోస్టులకు

# ప్రొవిజనల్ జాబితా విడుదల

### అభ్యంతరాలకు జూలై 17 వరకు గడువు : డా సీ ఉమా గౌరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 15):** మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను, 2025 జూలై 8న విడుదలైన నోటిఫికేషన్‌కు అనుగుణంగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో త్వరలో ప్రకటించనున్నారు. జాబితాలో ఏవైనా పొరపాటులు, అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు, సంబంధిత ఆధారపత్రాలతో పాటు తమ అభ్యంతరాలను జూలై 17, 2025 లోపు సమర్పించవలసిందిగా జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు.గడువు లోపల అందని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డా. సీ. ఉమా గౌరి స్పష్టం చేశారు.

## చౌడాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కావలి గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నిక



**చౌడాపూర్,మేజర్ న్యూస్ (జులై 15 ):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం మంగళవారం రోజు చౌడాపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,చౌడాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చౌడాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కావలి గోపాల్‌ను, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా దండు నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా పరిగి రాములు,బుడగ జంగం యాదయ్య,ప్రధాన కార్యదర్శిగా దాసరి నరసింహులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, నరసింహ నాయక్,దామోదర్ రెడ్డి,మాసయ్య సలీం,వెంకటయ్య గౌడ్,గోపాల్ నాయక్, రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## రాచకొండ కమిషనరేట్‌కు

# బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ

● టి.వి. హనుమంత్ రావుకు ఘన సన్మానం...

● వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నుండి ఆత్మీయ వీడ్కోలు



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 15):** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సేవలందించి, రాచకొండ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ టి.వి. హనుమంత్ రావు కు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి టి.వి. హనుమంత్ రావును శాలువా, పూలమాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ...., టి.వి. హనుమంత్ రావు వికారాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు విశేష కృషి చేశారని ప్రశంసించారు. ముఖ్యంగా క్రమశిక్షణ, అంకితభావంతో ఆయన చేసిన సేవలు జిల్లా పోలీస్ శాఖకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. క్లిష్ట సమయాల్లో ఆయన అందించిన సహకారం, మార్గనిర్దేశం ఎంతో విలువైనవని గుర్తు చేసుకున్నారు.ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.వి. మురళీధర్, డిఎస్‌పిలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లతో పాటు జిల్లా పోలీస్ శాఖలోని ఇతర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కీ కొమ్ముకాస్తున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులు

▶▶ కాంగ్రెస్ ఇచ్చిన పథకాలల్లో మాజీలే... పెత్తనం

▶▶ బీసీలకు 42 శాతం కల్పించినందుకు... స్వాగతిస్తున్న బిజెపి



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 15):బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని బిజెపి సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి హెచ్చరించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ అధికారుల అవినీతి, అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ, ఆ నాయకుల అండదండలతో కార్పొరేషన్ పాలనలో ప్రజలు బలవుతున్నారనీ, కార్పొరేషన్ అధికారుల పైన భారతీయ జనతా పార్టీ నిఘా పెట్టి అవినీతి, అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చి అధికారులను ఇంటికి పంపడం జరుగుతుందని విలేకర్ల సమావేశంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పద్ధతిని మార్చుకొని ప్రజలందరికీ పనులు చేయాలని, ప్రజలు కూడా వారికి అనుకూలంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు వారి వారి ప్రాంతాలలో వారే ముఖ్యమంత్రిగా రాజ్యాంగ శక్తులుగా తయారై ప్రజలను మభ్యపెడుతూ అవినీతి, అక్రమాలకు ఎల్ఆర్ఎస్ పేరుతో నకిలీ ఎల్ఆర్ఎస్ జిరాక్స్ లు పెట్టి అధికారులతో పార్కు స్థలాలను అక్రమంగా కబ్జా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. కార్పొరేషన్ అధికారులు పద్ధతులు మార్చుకొని ప్రజలందరికీ అనుకూలంగా అభివృద్ధి చేయాలని హెచ్చరిస్తూ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ప్రభుత్వానికి స్వాగతిస్తున్నామని శంకర్ రెడ్డి తెలిపారు. కానీ బిసి క్యాటగిరిలో మైనార్టీ ముస్లింలను కలిపినట్లయితే భారతీయ జనతా పార్టీ ఘాటుగా సమాధానం ఉంటుందని హెచ్చరించారు. బీసీ వాళ్లు కాంగ్రెస్ చెప్పినట్లు మోసపూరిత వాగ్దానం ప్రజలు నమ్మొద్దని ఆయన అన్నారు. జరగబోయే ఎన్నికల్లో మళ్లీ తప్పుడు వాగ్దానంతో వస్తే వాళ్లకు సరైన బుద్ధి చెప్పవలసిందిగా ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులకు ఆహ్వానం.. ఎమ్మార్పీఎస్

### డిసిపి సునీత రెడ్డి, ఏసీబీ జానకి రెడ్డి,లతో పాటు బాలాపూర్ సీఐ సుధాకర్‌కు శాలువాతో ఘన సత్కారం



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 15): డీసీపీ సునీత రెడ్డి ని ఏసీబీ జానకి రెడ్డిని బాలాపూర్ సిఐ సుధాకర్ ని ఘనంగా ఎమ్మార్పీఎస్ నాయకులు శాలువాతో సన్మానించి ఆహ్వానం పలికారు. మహేశ్వరుని నియోజకవర్గంలోని బాలాపూర్ గ్రామంలో గురువారం రోజున ఎం ఆర్ పి ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులను ఆహ్వానించారు. ఆరోజున (17/7/2025) బోనాల పండుగా సందర్భంగా పోలీస్ సిబ్బందితోపాటు పలువురు ఉన్నతాధికారులు పరిశీలించి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని పోలీస్ బృందానికి ఆహ్వాన పత్రిక అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయగా నిర్వహించే బోనాల పండుగని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోర్ర రవి మాదిగ, రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు మస్కూరి సుధాకర్, మహిళా నాయకురాలు జె.ఇంద్ర, ఆనంద్, పట్వారి కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కురుమల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

### మండల కురుమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటయ్య



శంకరపల్లి మేజర్ న్యూస్ (జూలై 15) కురుమల అభివృద్ధి కొరకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని మండల కురుమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటయ్య అన్నారు. మంగళవారం రోజున మండలంలోని కొండకల్ గ్రామంలో కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొండకల్ గ్రామ అధ్యక్షుడిగా గుత్తి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా తైదలా రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కార్యదర్శులుగా శ్రీహరి, విట్టల్, కోశాధికారిగా రాఘవేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండమీది వెంకటయ్య మాట్లాడుతూ కురుమ సంఘం అభివృద్ధికి సంఘంలోని సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో కురుమ సంఘం నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రభుత్వం కూడా కురుమల అభివృద్ధి కొరకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో కురుమల కోసం కష్టపడే వారికి సంఘంలో అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కురుమ సంఘం ఉపాధ్యక్షుడు అశోక్, చేవెళ్ల నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళలను ప్రోత్సహించాలి : జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి



మహేశ్వరం,మేజర్‌న్యూస్(జూలై15): సమాజం మరచిన రంగస్థలాన్ని, కనుమరుగవుతున్న కళలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలో శ్రీ మారుతి నాట్య కళా మండలి జడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో. ద్రౌపది వస్త్రాపహరణం: పూర్తి పౌరాణిక పద్య నాటకం రామాంజనేయ యుద్ధం నాటకంలోని యుద్ధాన్ని ప్రదర్శించారు.

ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. నేడు నాటకాలకు స్థానం తగ్గినట్లే కనిపించొచ్చు, కానీ నాటకరంగాన్ని ప్రోత్సహించాలని పట్టు, అభిరుచి ఉన్నవారితో మళ్లీ అది మేలుకోగలదు. నాటకం ? ఒక కళ మాత్రమే కాదు, భావనల బంధం.ప్రాచీన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు.

శిశుపాలుడు పాత్రధారి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు బస్వా పాపయ్య గౌడ్ , దుర్యోధన పాత్రధారి అయిన జిల్లా నాయకులు మిద్దె సుదర్శన రెడ్డి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్ గౌడ్, జంగయ్య యాదవ్, అశోక్ గౌడ్, కొంరయ్య, మహాలింగం, అనంతయ్య గౌడ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు టి యాధిష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ వెంకటేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న మల్రెడ్డి నిరంజన్ రెడ్డి



మంచాల, మేజర్ న్యూస్ (జులై 15) : మండల కేంద్రానికి చెందిన పశువుల వెంకటేష్ ముదిరాజ్ (కానిస్టేబుల్) సోమవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ మల్రెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం మంచాలలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకుముందు కానిస్టేబుల్ వెంకటేష్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కానిస్టేబుల్ వెంకటేష్ మరణ వార్త తనను ఎంతగానో కలచివేసిందన్నారు. నియోజకవర్గంలోనే వెంకటేష్ గొప్ప క్రికెట్ ఆటగాడని కొనియాడారు. గొప్ప క్రీడాకారున్ని కోల్పోవడం బాధకరమన్నారు. మృతుడు వెంకటేష్‌తో తనకు ఉన్న అనుబంధాన్నిగుర్తు చేసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ ఎడ్మ నరేందర్ రెడ్డి, నాయకులు మహేష్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, శివ గౌడ్, మధు, క్రికెట్ క్రీడాకారులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలినీ ధర్నాతో డిమాండ్



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై15): భారత రాష్ట్ర సమితి మీర్ పేట్ బీసీ నాయకులు రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని ధర్నా పాల్గొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్ బిసి నాయకులు హైద్రాబాద్ ఇంద్రా పార్క్ లోని బి సి పి ఎఫ్ ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు జమాల్ పూర్ సునితా బాల్ రాజ్, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, సిద్దాల లావణ్య బీరప్ప, ఉయ్యాల నవీన్ కూమార్ గౌడ్, మాజీ కోప్షన్ సభ్యులు పల్లే జంగయ్య గౌడ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సిరుర్ బాల్ రాజ్, బీసీ నాయకుడు కర్రె వెంకటేశ్ కుర్మా లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగంలో నేడు అంతరాయం



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జులై 15):విద్యుత్ వినియోగంలో నేడు అంతరాయం ఉంటుందని ఏఈ ఎల్ వి సత్యనారాయణ తెలిపారు.గౌస్ నగర్ 11కేవీ ఫీడర్ లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా గౌస్ నగర్, హుస్సేన్ నగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, సాదత్ నగర్ , అహ్మద్ నగర్, ఇస్మాయిల్ నగర్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. 11కేవీ నూరి నగర్ ఫీడర్ లో విద్యుత్ పరమత్తుల కారణంగా నూరి నగర్ ఏ, నూరి నగర్ బి, సోనీ గ్రూప్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ వినియోగంలో అంతరాయం ఉంటుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# వికారాబాద్ మున్సిపల్‌లో నాయకుల పెత్తనం

- మున్సిపాలిటీలో పాలన కన్నా రాజకీయం పెరిగింది
- అధికారులకు తలనొప్పిగా మారిన రాజకీయ నేతల తీరు
- మున్సిపల్ లో జరిగే అక్రమాల వెనక కొందరు రాజకీయ నాయకులు
- ప్రతి పనిలో నాయకుల జోక్యం
- అధికారుల విధులకు ఆటంకం
- పాలకవర్గం ముగిసినప్పటికీ కొనసాగుతున్న కొందరి నాయకుల పెత్తనం

**వికారాబాద్, మేజర్‌న్యూస్ (జులై 15)ః** అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వికారాబాద్ మున్సిపల్‌కు ఇంకా మంచి రోజులు రాలేవని వాదన వినిపిస్తుంది. ఎన్నోపార్టీలు అధికారంలోకి వచ్చినా.. ఎందరో నాయకులు మున్సిపల్‌ను పాలించినా మున్సిపల్ అభివృద్ధిలో మాత్రం మార్పు రాలేదు. ముఖ్యంగా మున్సిపల్‌లో రోడ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉన్నాయి. మున్సిపల్‌కు అనేక రకాలుగా ఆదాయం చేకూరుతున్నప్పటికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నుండి నిధులు సమకూరుతున్నప్పటికి ఇక్కడి ప్రాంతం మాత్రం మారడం లేదు. అయితే వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధి చెందకపోవడానికి ఇక్కడి రాజకీయ నాయకులే ప్రధాన కారణం అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో అధికారులపై కొందరు రాజకీయ నాయకుల పెత్తనం రోజురోజుకూ పెరిగిపోవడతంతో అధికారులు విస్మయానికి గురవుతున్నట్లు తెలుస్తుంది. గతంలో తమ స్వార్థ రాజకీయాలు చేస్తూ మున్సిపల్‌లో జరిగే ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడంతో వార్డులకు సమానమైన అభివృద్ధి జరగ లేదని వాదనలు వినిపించాయి. అయితే పాలకవర్గం ముగిసినప్పటికి కూడా కొందరి నాయకులు మున్సిపల్ పరిపాలనలో జోక్యం చేసుకొని వారి పెత్తనం కొనసాగిస్తున్నారంటూ ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా పదవిలో ఉన్నా.. లేకపోయినా తము చెప్పిందే వినాలి లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ ఒత్తిడి తెస్తున్నారంటూ నాయకుల తీరు పట్ల అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.




**ప్రతి పనిలో పలువురి నేతల జోక్యం..**

అభివృద్ధి పనుల నుంచి భవన అనుమతుల వరకూ, పారిశుద్ధ్య పనుల నుంచి సిబ్బంది నియామకాల వరకూ ప్రతి విషయానికీ నాయకుల జోక్యం తప్పడం లేదు.. వారు చెప్పిందే తుది ఆదేశమని భావిస్తూ, చట్టాలను పక్కన పెట్టాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో అధికారులు వారి విధులను నిర్విఘ్నంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తే వారిపై రాజకీయం అధికంగా చూపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సిన అధికారులను స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రాధాన్యతల కంటే తమ రాజకీయ లాభాలను దృష్టిలో పెట్టుకొని ప్రభావితం చేయాలని చూస్తున్న పరిస్థితి నెలకొంది.

**అధికారులకు తలనొప్పిగా మారిన నేతల తీరు..**

మున్సిపల్ అధికారులు ప్రభుత్వ నియమావళి ప్రకారం విధులను నిర్వహించాలి. వారిలో టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యం, పన్నుల వసూలు, నీటి సరఫరా, భవన అనుమతుల పరిశీలన వంటి బాధ్యతలు ఉంటాయి. ఏ నిర్ణయమైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తీసుకోవాలి. రాజకీయ నాయకుల సూచనలు వినడం తప్ప, వాటిని తప్పనిసరి ఆదేశాలుగా తీసుకోవాల్సిన అవసరం లేదు. కాని రాజకీయ నాయకులు వారి విధులలో జోక్యం చేసుకోవడంతో వారు తమ హక్కులను, అధికారాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతున్నారు. ప్రత్యేకంగా వికారాబాద్ మున్సిపల్‌లో అధికారుల పై ఒత్తిడి చేసే నేతలు ఉండడతో వారి వల్లే ఇక్కడి అభివృద్ధి కుంటు పడుతుందని వాధన వినిపిస్తుంది. అంతేకాకుండా ఈ మున్సిపల్‌లో పరిపాలన ఇతర మున్సిపల్స్ కంటే బిన్నంగా ఉంటుందని ఇక్కడ రాజకీయ నాయకులు చెప్పిందే వేదం.. ఇక్కడ అధికారులకు స్వేచ్ఛ ఉండదు అనే టాక్ బహిరంగంగా వినిపిస్తుంది.

**అక్రమాలకు నాయకులే అండ...**


వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా కబ్జాలు జరిగినా, అక్రమ నిర్మాణం చేపట్టిన, నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు కొనసాగించే అక్రమార్కుల వెనుక ఖచ్చితంగా రాజకీయ నాయకులు ఉంటారు. ఇది అందరికి తెలిసిన విషయమే.. సామాన్య ప్రజలు ఏదైనా నిర్మాణం చేపడితే మున్సిపల్ అధికారులు ఏదో ఒక సాకుతో దానిపై మూకుమ్మడిగా చర్యలు తీసుకుంటారు. కాని ఎవరైనా పలుకుబడి ఉన్నవారు కోట్ల విలువైన మున్సిపల్ స్థలాలను కబ్జా చేసినా, నిబంధనలకు విరుద్దంగా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా రాజకీయ ఒత్తిడి ఉండడంతో వారిపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేస్తారు. అధికారులు తమ విధులను ఎటువంటి పక్షపాతం లేకుండా న్యాయంగా నిబంధనల మేరకు నిర్వహించాలని అనుకున్నా... వారి విదులలో నాయకులు జోక్యం చేసుకోవడంతో న్యాయపరంగా విధులను నిర్వర్తించలేక పోతున్నామంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా అందరికి సమన్యాయం జరగకపోవడానికి ప్రధాన కారణం రాజకీయ నాయకులే అని చెప్పవచ్చు. ఈ వ్యవహారం వికారాబాద్ మున్సిపల్‌లో కొన్ని ఏళ్ల నుండి కొనసాగుతూ వస్తుంది. మున్ముందు నాయకులు పెత్తనం ఇలానే కొనసాగుతుందా.. లేదా అధికారులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించేందుకు అవకాశం ఉంటుందా వేచి చూడాలి.

# దార్గులపల్లి వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు...

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు...
- అక్రమ విద్యుత్ కొంకెలతో... అనుమతి లేని బోరు
- చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు
- అధికారుల కనుసైగల్లో అక్రమ నిర్మాణాలు



వెంచర్‌లో అక్రమ నిర్మాణం.



అక్రమ విద్యుత్ .

**మర్పల్లి, మేజర్‌న్యూస్(జులై15)ః** మర్పల్లి మండల పరిధిలోని దార్గులపల్లి గ్రామశివారులో వెంచర్‌లో ఏలాంటి అనుమతులు లేకుండానే వెంచర్‌లో నిర్మాణాలుచేపట్టడం ఓవైపు అయితే విద్యుత్ అనుమతి లేకుండానే అక్రమ విద్యుత్,దానికితోడు బోరు మోటారుకు బిగించి అక్రమంగా బోరును ఉపయోగిస్తున్నట్లు పలువురు ఆరోఫిస్తున్నారు. అన్ని అనుమతులున్న తమ వ్యయసాయ బావులకు కనీసం నీటి పారుకానికి విద్యుత్ అంతరాయం కలుగుతుంది అలాంటిది ఏకంగా అక్రమ విద్యుత్ కొంకోలతో తలగించి బోరు మోటారును వినియేగించుకోవడం పై పలువురు గ్రామస్తులు ఆరోపిస్తూన్నారు. ఇక నిర్మాణాలకు గ్రామ కార్యదర్శీ,తహాశిల్దార్ అనుమతి పొందాల్సి ఉంటుంది అలాంటి ఏలాంటి అనుమతులు లేకుండానే ఏకంగా భవన నిర్మాణాలు చేపట్టడం ఏమిటనీ కొందరు ప్రశ్నింస్తున్నారు. ఇక వెంచర్‌లోకి ఎర్రమట్టిని తరలించి క్రయవిక్రయాలు చెపడుతున్నారనీ కొందరు పేర్కోంటున్నారు. మండల కేంద్రానికి కూతపెట్టు దూరంలో ఇన్ని అక్రమాలు జరుగుతుంటే రేవెన్యూ అధికారులకు తెలియదా అనికొందరు విమర్శిస్తూన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పంధించి అక్రమ వెంచర్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమంగా మట్టి కుప్పలు.

## చాకల్ పల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు




**చౌడాపూర్,మేజర్ న్యూస్ (జులై 15):** చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్ పల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు గ్రామ ప్రజలందరూ మంగళవారం రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు శేఖర్ మాట్లాడుతూ... పోచమ్మ తల్లి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలందరూ, గ్రామంలోని పశుపక్షాదులు,వ్యవసాయ సంపద నిండుగా ఉండేటట్లు అమ్మవారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్,చెన్నయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఓటరు జాబితా సవరణకు సహకరించాలి
## తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్




రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్

**కొడంగల్, మేజర్ న్యూస్ (జూలై 15):** రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితా సవరణకు సహకరించాలని తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఓటరు నమోదు తదితర అంశాలపై చర్చించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహకరించాలని కోరారు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏలను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం

- పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



**దోమ, మేజర్‌న్యూస్ (జులై 15)ః** దోమ మండలం అనుబంధ గ్రామం ఉధన్ రావుపల్లి గ్రామానికి చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుడు అయిన గుడిసె గణేష్‌కు మంజూరైన 60 వేయిల చెక్కును ఉదన్ రావు పల్లి గ్రామ యువ నాయకులు కృష్ణ, రమేష్,, చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని, వారి క్షేమం కోసమే అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతునాయి. అదేవిధంగా చెక్కు అందుకున్న కుటుంబీకులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విధాలుగా మేలు జరుగుతుందని మాకు సీఎంఆర్ఎఫ్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మా ఊరి గ్రామ నాయకుల సమక్షంలో అందించడం మాకు ఎంతో సంతోషకరమని కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టి అంజిలయ్య.గొల్ల ఎల్లప్ప. పి రమేష్,గుడిసె నర్సింలు, గుడిసె అంజిలయ్య, గుడిసె సతీష్,యస్ బురాన్, కోస్గి వెంకటయ్య, మాల నర్సింలు,నిరటి నర్సింలు, ఈ కార్యక్రమంలో పాల్గొని చెక్కులు అందజేశారు.

# మహిళలకు అండగా జిల్లా భరోసా కేంద్రం...

## జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి




**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 15):** మహిళలకు అండగా జిల్లా భరోసా కేంద్రం ఉంటుందని జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.వికారాబాద్ జిల్లా పోలీస్ కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సంధార్భంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) కె. నారాయణ రెడ్డి భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం పని తీరును పరిశీలించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎస్పీ నారాయణ రెడ్డి భరోసా కేంద్రం సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళల సంరక్షణ, సహాయం కోసం భరోసా కేంద్రం అందిస్తున్న సేవలను కొనియాడారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు.

అనంతరం, ఎస్పీ నారాయణ రెడ్డి బాధిత మహిళలకు విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ క్రింద ఆర్థిక సహాయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

భరోసా కేంద్రం మహిళలకు, పిల్లలకు అండగా నిలుస్తోంది. గృహ హింస, లైంగిక వేధింపులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని విధాలా సహాయం అందిస్తుందని తెలిపారు. బాధితులకు న్యాయం అందించడంలోనూ, వారికి మానసిక ధైర్యాన్ని ఇవ్వడంలోనూ భరోసా కేంద్రం సిబ్బంది పాత్ర అభినందనీయం" అని అన్నారు. భ రో సా కేంద్రం ద్వారా ఇప్పటికే వందలాది మంది మహిళలు లబ్ధి పొందారని, వారికి కౌన్సిలింగ్, చట్టపరమైన సహాయం, వైద్య సేవలు వంటివి అందించబడ్డాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులోనూ భరోసా కేంద్రం తన సేవలను విస్తరించి, మరింత మంది మహిళలకు చేరువ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.వి.హనుమంత్ రావు, పీవీ మురళీధర్, డీఎస్పీలు, భరోసా కేంద్రం సమన్వయకర్తలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- కవిత ఎమ్మెల్సీ పదవిని వెంటనే రద్దు చేయాలి
- తీన్మార్ మల్లన్నను పరామర్శించిన లక్ష్మాపూర్ మున్నూరు కాపు సంఘం నేతలు



తీన్మార్ మల్లన్న పరామర్శిస్తున్న మున్నూరు కాపు నాయకులు

**శామీర్ పేట,మేజర్ న్యూస్,(జూలై 15)**
క్యూ న్యూస్ కార్యాలయం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) తెలంగాణ జాగృతి దాడి చేయడంతో గాయపడిన మల్లన్నను మూడు చింతలపల్లి పురపాలక సంఘం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం నేతలు (చిన్ననాటి స్నేహితులు) పరామర్శించారు.
సందర్భంగా వారు మాట్లాడుతూ...... ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ జాగృతి పేరుతో గుండాలను ఉసిగొల్పి దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే కవిత ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి మున్నూరు కాపు బడుగు బలహీన వర్గాల నాయకులతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పాల భాస్కర్, వట్టెం శ్రీనివాస్, సింగం భాస్కర్, కవాడి రవి, జయల పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు

## పాల్గొన్న శ్రీరాములు యాదవ్



మహేశ్వరం,మేజర్‌న్యూస్(జూలై15):
తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో బీజేవైఎం అధ్యక్షులు బరిగెల రాకేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆషాడ మాస బోనాల సందర్భంగా పలహారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.. ఈకార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాకేష్ గౌడ్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు, మాజీ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ శ్రీరాములు యాదవ్‌ని ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు రాజమోని రాజు ముదిరాజ్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, రాజు ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్ సదా మల్లారెడ్డి, అమరేందర్ రెడ్డి, చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, కొంతం జంగారెడ్డి, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు రాఘవేందర్ ముదిరాజ్, మీర్పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్, యువమోర్చా నాయకులు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని మార్చే శక్తి మీడియాకు ఉంది...

- మీడియా ప్రతినిధులు పక్షపాతం లేకుండా వాస్తవాలను వెలికి తీయాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- ప్రభుత్వానికి ప్రజలకు మీడియా వారధిగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 15):సమాజాన్ని మార్చే శక్తి మీడియాకు ఉందని, పక్షపాతం లేకుండా వాస్తవాలను బయటకు తీసుకోరావాలని చేవెళ్ల పార్లమెంటరీ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వార్తలాప్ మీడియా వర్క్ షాప్ ను నిర్వహించారు. వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతికూల వార్తలతోనే కాకుండా సానుకూల వార్తలతో కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చన్నారు. రాజకీయాలను రాజకీయ నాయకులే మాట్లాతారు కాబట్టి మీడియా ప్రతి నిధులు తమ వ్యక్తిత్వాన్ని కాకుండా ప్రజల అభిప్రాయాలను, వాస్తవాలను బయటకు తీసుకురావాలని ఆయన తెలిపారు. దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, భారత ప్రభుత్వం ఈ దేశాభివృద్ధితో పాటు తెలంగాణను కూడా అభివృద్ధి చెస్తుందని ఆయన తెలిపారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా కృషి చేయాలని దీని వల్ల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.
జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడు తూ ... ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా మీడియా పాత్ర ఉండాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చే విధంగా వార్తల ద్వారా సహాయ పడేందుకు మీడియా పాత్ర పోషించాలని కలెక్టర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్షి చౌదరి, పీఐబి డిప్యూటీ డైరెక్టర్ మానస క్రిష్ణ కాంత్, పీఐబి ఏడీజీ శృతి పాటిల్, ఎం అండ్ సిఓ శివచరన్, సిడిపీసీ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్ బాబు, ఎస్బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు విధ్యాదర్, శ్రీహరి, వికారాబాద్ జిల్లాలోని మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమం



ఎర్త్ పోగ్రాం ఆవిష్కరిస్తున్న మంత్రి,నాబార్డ్ సంస్థ సభ్యులు

**కందుకూరు, మేజర్‌న్యూస్(జూలై 15):** యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.నాబార్డ్ సంస్థ 44 వ వార్షికోత్సం పురస్కరించుకుని మంగళవారం హైద్రాబాద్ ముషీరాబాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పర్యావరణ సంస్థ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వారి సహకారంతో మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైనా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఎర్త్ లీడర్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాబార్ సంస్థ ప్రముఖులు ఉదయ్ భాస్కర్, చీఫ్ జనరల్ మేనేజర్ నాబార్డ్ రాధాకృష్ణ, ఎస్‌బిఐ చైర్మన్ ఎస్ఎల్‌బీసీ సీజర్ సంస్థ సీఈవో నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ అన్నయయ, పోగ్రాం కోఆర్డినేటర్ రజనీకాంత్, మెంటర్ పుష్పలత, ఎర్త్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## షాద్‌నగర్ రూరల్ సిఐ నర్సయ్య




పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న షాద్‌నగర్ రూరల్ సిఐ నర్సయ్య

**కొందుర్గు, మేజర్ న్యూస్ (జూలై 15):** పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ రూరల్ సిఐ నర్సయ్య పోలీస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పోలీసులకు విధి నిర్మాణ పట్ల పలు సూచనలు చేశారు. అనంతరం 100 డయల్‌పై వచ్చిన సమాచారానికి వెంటనే స్పందించాలని సూచించారు. ప్రజల సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్ నాయక్ పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# జీరో ఎఫ్ఐఆర్ కేసులపై నిర్లక్ష్యం తగదు...

- జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు,నేర నియంత్రణకు కట్టుబడి ఉన్నాం
- జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 15):** జీరో ఎఫ్ఐ ఆర్ కేసులపై నిర్లక్ష్యం తగదని జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి అన్నారు.వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో నిర్వహించిన సమగ్ర సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా జీరో ఎఫ్ఐఆర్ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన గట్టిగా హెచ్చరించారు.జిల్లాలో నమోదైన కేసుల వివరాలను, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. డిఎస్పి, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. దీనివల్ల బాధితులకు సత్వర న్యాయం అందుతుందని, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన అన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. సీసీటీవీలు నేరాల నియంత్రణలో, నేరస్తులను గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు. నిరంతరం వాహన తనిఖీలు (వెహికిల్ చెకింగ్), డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ను పెంచాలని, వీటిని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు.ప్రమాదాలు, ఆత్మహత్యలు జరగకుండా నివారించేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలతో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించాలని తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్‌లో 5S పద్ధతి (Sort, Set in order, Shine, Standardize, Sustain)ని తప్పకుండా పాటించాలని, పరిశుభ్రత, క్రమశిక్షణ తో కూడిన వాతావరణాన్ని నెలకొల్పాలని ఆదేశించారు.కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్‌లో ప్రతి ఫంక్షనల్ వెర్టికల్ పనితీరు గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.ఎన్‌బిడబ్ల్యు (Non-Bailable Warrants)లు పెండింగ్‌లో లేకుండా చూడాలని, వాటి అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు.పాత నేరస్థులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి అవసరమైన కౌన్సెలింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వారిని తిరిగి సమాజంలో సక్రమంగా జీవించేలా ప్రోత్సహించాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్ కేసులలో (తీవ్రమైన నేరాలు) నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పోలీస్ అధికారులు పటిష్టంగా దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్) చేయాలని ఆయన ఆదేశించారు. నాణ్యతతో కూడిన దర్యాప్తు మాత్రమే నేరస్తులకు శిక్ష పడేలా చేస్తుందని గుర్తు చేశారు.పోలీస్ డైల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఆయన ప్రత్యేకంగా జీరో ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యతను చెప్పారు. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరం జరిగినా, బాధితులు ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా, తక్షణమే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు పూర్తి సహకారం అందించాలని, జీరో ఎఫ్ఐఆర్ కేసుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే, వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇది ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా పోలీసింగ్ సేవలను అందిస్తుందని ఆయన వివరించారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీలు పి.వి. మురళీధర్, టి.వి. హనుమంత్ రావు, తాండూర్, పరిగి, వికారాబాద్, ఏఆర్ డిఎస్పిలు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, వీరేశం, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా ఎస్ఐ అధికారులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



# తాండూరులో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తాం...

- క్రీడాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది
- ప్రభుత్వ చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి వెల్లడి

**తాండూరు/తాండూరు రూరల్ మేజర్ న్యూస్ (జూలై 15):** తాండూరులో ముమ్మందు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తాం అని,అందుకుగాను అన్నీ చర్యలు తీసుకుంటాం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. క్రీడాలను తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహం ఇస్తుంది అని అన్నారు. తాండూరు మండలం లోని జీన్గుర్తి గ్రామంలో మంగళవారం నాడు గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు పి.శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకర్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.... జాతీయ వాలీబాల్ పోటీలు నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేస్తా అని అన్నారు.తాండూరు లో గతంలో పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు.అదే విదంగా అందరి సహకారంతో అన్నీ రాష్టాల నుండి వాలీబాల్ క్రీడాకారులను రప్పించి పెద్ద ఎత్తున పోటీలను నిర్వహిస్తాం అని పేర్కొన్నారు. తన సోదరుడైన దివంగత రాజేందర్ రెడ్డి జ్ఞాపకర్థం ప్రతి ఏటా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తూ. యువతను ప్రోత్సహిస్తున్నట్లు పట్నం చెప్పారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అని తెలిపారు.క్రీడాలతోపాటు చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ద పెట్టి ఉన్నత చదువులు చదువాలి అని అన్నారు.తాను మంత్రిగా ఉన్నప్పుడు తాండూరు నియోజకవర్గంలో వేల కోట్ల నిధుల తో ఎన్నో అభివృద్ధి పనులు చేశాను అని. ఎక్కడ చూసిన నేను చేసిన పనులే కనిపిస్తాయి అని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాస్ జ్ఞాపకర్తం ఇక్కడ వాలి బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ప్రస్తుతం విస్తరణలో ఉన్న జాతీయ రహదారి వేగవంతంగా పూర్తి కావడం కోసం కృషి చేస్తాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కరణం పురుషోత్తం రావు, డాక్టర్ సంపత్ కుమార్, ఉత్తమ్ చందు, బీజేపీ పార్టీ నేత రమేష్ కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ నేత రామలింగ రెడ్డి, తో పాటు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపిడిఓ...

**పరిగి. మేజర్ న్యూస్ (జూలై 15).** పరిగి మండల పరిధిలోని ఘుడిసింగాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంకట్ రాములు తో కలిసి పరిగి ఎంపిడిఓ కరీం పరిశీలించారు.



## పోచమ్మ తల్లి పలహారం బండి కార్యక్రమానికి విరాళం అందజేసిన కాంగ్రెస్ నాయకులు...



**రూ.30వేలు విరాళం అందజేస్తున్న పట్టణ కాంగ్రెస్ నాయకులు.**

**పరిగి. మేజర్ న్యూస్ (జూలై 15)** పరిగి పట్టణంలోని యూత్ మినిస్ట్రీ అసోసియేషన్ పరిగి ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి పలహారం బండి కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ నాయకులు కలిసి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డ పల్లి కృష్ణ ఆధ్వర్యంలో పలహారం బండి ఊరేగింపు కార్యక్రమం నిమిత్తం రూ.30వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్లు కుడుముల యాదయ్య, గణేమోని శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ రెడ్డి, భానుపటేల్, నిర్వాహకులు కుడుముల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈడిగి ఆశన్నగౌడ్ తోనే గ్రామం అభివృద్ధి



దోమ, మేజర్ న్యూస్ (జులై 15): దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ సమస్య ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ విషయాన్ని అయినాపూర్ గ్రామ ప్రజా సేవకుడు ఈడిగి ఆశన్న గౌడ్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రతిపాదనల సిద్ధం చేసి 33/11జులసబ్ స్టేషన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అయినా పూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు రవికుమార్ గౌడ్,సర్దార్ జహంగీర్,ఖదీర్ వికారాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ సూపర్డెంట్ ఇంజనీర్ ను కలసి లెటర్ ను అందజేశారు. సబ్ స్టేషన్ పనులను త్వరలో ప్రారంభిస్తామని విద్యుత్ సూపర్డెంట్ ఇంజనీర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళల కోసం పెట్రోల్ బంక్ స్థల పరిశీలన

- ఆర్థిక స్వయం సమృద్ధి దిశగా మహిళలకు శిక్షణ : మండల అధ్యక్షురాలు జ్యోతి



**మేడ్చల్,మేజర్ న్యూస్(జులై,15):**
మహిళల ఆర్థిక అభివృద్ధి మరియు స్వలంబన సాధన దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకం అనుసంధానంగా, అత్వెల్లి గ్రామంలో మహిళలతో నడుపబోయే పెట్రోల్ బంక్ స్థల పరిశీలన మంగళవారం నిర్వహించబడింది.

ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ – “ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ పథకం ద్వారా మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు, స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహణ చేసే అవకాశాన్ని కల్పించనుంది. ఇది వారికి ఆర్థిక స్వావలంబన అందించడమే కాక, అభివృద్ధికి బాటలు వేసే ఉద్యమంగా మారనుంది,” అని తెలిపారు.స్థల పరిశీలన కార్యక్రమంలో ఏపీఎం శేఖర్, సీసీ జ్యోతి, మహేశ్వరి, దాశేందర్ పాల్గొన్నారు.

# వ్యవసాయరంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పెద్దపీట

▶▶ రైతులకు ఏక కాలంలో రూ.2లక్షలలోపు పంట రుణాల మాఫీ, వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్తు, అర్హులైన రైతులందరికి ఎకరాకు 12వేల పంటల పెట్టుబడి సాయం, రాయితిపై స్ప్రింక్‌లర్లు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది

▶▶ అప్పారెడ్డిపల్లి గ్రామ రైతులకు 12 సెట్ల స్ప్రింక్‌లర్ల పంపిణీలో మాడ్గుల మాజీ జడ్‌పిటిసి గౌరవరం ప్రభాకర్‌రెడ్డి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూలై 15): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వ్యవసాయరంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ రైతు కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నట్లు మాడ్గుల మాజీ జడ్‌పిటిసి గౌరవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులకు కేవలం లక్ష రూపాయల రుణమాఫీ సక్రమంగా అమలుకాకపోగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకిచ్చిన హామి మేరకు ఏక కాలంలో 2లక్షల రూపాయల లోపు పంట రుణాలన్ని మాఫీ చేసి రైతుపక్షపాత ప్రభుత్వంగా నిరూపించుకున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల కష్టనష్టాలు తెలిసిన నాయకులు కాబట్టి వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, ఎకరాకు రెండు పంటలకు 12వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడమే కాకుండ అర్హులైన రైతులందరికి రాయితీపై వ్యవసాయ పనిముట్లు , స్ప్రింక్‌లర్లు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈమేరకు మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా మంజూరుచేసిన 12 సెట్ల స్ప్రింక్‌లర్ పైపులను మంగళవారం స్థానిక నాయకులు, సంబంధితశాఖ అధికారిణీతో కలిసి మాజీ జడ్‌పిటిసి ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ఎకరాకు యేటా 10వేల రూపాయల పెట్టుబడి సాయం అందించి రైతులకు మిగతా వ్యవసాయ పనిముట్లు, రాయితీలన్నింటిని ఎత్తివేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో పాటు అన్నివర్గాల అభ్యున్నతిని కాంక్షించి సంక్షేమ , అభివృద్ధి పథకాలు రూపొందించి సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామిలన్నింటిని పకడ్భందీగా అమలుచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఏకంగా 5లక్షల రూపాయలు మంజూరుచేస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల మన్ననలు పొందుతుందని ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తోట చంద్రయ్యయాదవ్, పల్లేటి జంగమ్మయాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుతల వెంకటయ్యగౌడ్, కాస సత్యనారాయణకురుమ, కాస చంద్రయ్య,శివప్రసాద్‌గౌడ్, ఉడుతల లాలయ్య, ముక్కెర వెంకటయ్య, నర్సింహ్మా , నాగిల్ల మడేల్, బర్ల నర్సింహ్మా, ఉడుతల యాదయ్య, సత్యం, తోట పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మెడికల్ కిట్ల పంపిణీ

మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూలై 15): మాడ్గుల మండలం నర్సంపల్లి గ్రామపంచాయతికి చెందిన పలువురు గర్భిణీలకు తలకొండపల్లి మాజీ జడ్‌పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మెడికల్ కిట్లు సమకూర్చినట్లు నర్సంపల్లి మాజీ సర్పంచ్ హనుమాన్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు గ్రామపంచాయతికి చెందిన గర్భిణీలకు స్థానిక నాయకులతో కలిసి మెడికల్ కిట్లు తాను పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. గతకొన్నేండ్లుగా ఇండ్లులేని వందలాదిమంది పేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణ సామాగ్రిని అందించి ఆదుకున్నట్లు వివరించారు.అదేవిధంగా ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా అన్ని మండలాల్లో గర్భినీల ఆరోగ్యపరిరక్షణకు కాంక్షించి ఉచితంగా మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు హనుమాన్ రాథోడ్ పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో ఉప్పల వెంకటేష్ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలందరి మన్ననలు పొందుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామస్థులు కాస సత్యనారాయణకురుమ, కాస చంద్రయ్య,శివప్రసాద్‌గౌడ్, ఉడుతల లాలయ్య, ముక్కెర వెంకటయ్య, నర్సింహ్మా , నాగిల్ల మడేల్, బర్ల నర్సింహ్మా, ఉడుతల యాదయ్య, సత్యం, తోట పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషకరం





శంకర్పల్లి మేజర్ న్యూస్ (జూలై 15) సరస్వతి శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషకరమని సరస్వతి శిశుమందిర్ పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం రోజున రోటరీ క్లబ్ శ్యామ్ పాల్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర్పల్లి పట్టణ కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రూపాయలు 7 లక్షలతో మరమ్మత్తులు చేసిన తరగతి గదుల ప్రారంభం మరియు 150 మంది పిల్లలకు స్కూల్ బ్యాగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు కేవలం దాతల సహకారంతోనే నడుస్తాయని, ఈ పాఠశాలలో చదువుతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణ కూడా నేర్పిస్తారని అన్నారు. రానున్న రోజుల్లో పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, డిజిటల్ పరికరాలు, ఆరోగ్యంపై అవగాహన వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శివాని, క్లబ్ సభ్యులు మరియు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జయ ప్రకాష్, మిరియాల శ్రీనివాస్, గోపాల్, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన శంషాబాద్ డిసిపి రాజేష్



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జూలై 15) : సర్కిల్ పోలీస్ స్టేషన్ ను శంషాబాద్ జోన్ డిసిపి బి. రాజేష్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను క్రైమ్ రికార్డ్స్ ను పరిశీలించారు. అనంతరం సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై వెంకటేష్ పోలీస్ సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడుతూ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులపట్ల బాధ్యత యుతంగా మెలగాలని ఆయన సూచించారు. పోలీసులు అంకితభావంతో విధులను నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని పోలీస్ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీతారాంరెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ ( జులై 15) : మండల పరిదిలోని పడమటి తాండా గ్రామ పంచాయతీ తాళ్లగుట్ట తండాకు చెందిన రాత్లావత్ కమ్లి, వాల్య దంపతుల కుమారుడు వంశీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాదపడుతూ మంగళవారం మృతి చెందడం జరిగింది. వంశీ మృతి విషయాన్ని మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్ ద్వారా తెలుసుకున్న డోకురి ప్రభాకర్ రెడ్డి మృతుడు వంశీ మృతికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు బాదిత కుటుంబానికి తన వంతు సహకారంగ 3వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్, దేవేందర్, హరికిషన్, శ్రీను, భాను, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోపమ్మ మరణం పార్టీకి తీరని లోటు

**సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య**



మంచాల, మేజర్ న్యూస్ (జులై 15) : సీపీఎం సీనియర్ నాయకురాలు గోపమ్మ మరణం మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు గోపమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య స్థానిక నాయకులతో కలిసి గోపమ్మ మృతదేహన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ గోపమ్మ గ్రామంలో వార్డు సభ్యులుగా ఎనికై గ్రామానికి ఎన్నో సేవలందించారని ఆమె సేవలను కొనియాడారు. గోపమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు మార బుగ్గరాములు, మండల కమిటీ సభ్యులు పుల్లగళ్ల గోపాల్, మండల మాజీ ఆఫ్షన్ సభ్యులు యూసుఫ్ అలీ, శాఖ కార్యదర్శి బోయపల్లి అంజయ్య, సీపీఎం సీనియర్ నాయకులు శంకరయ్య, సాతిరి సత్తయ్య, తాళ్ల నర్సింహ, కిష్టయ్య, పిడుగు గాలయ్య సీఐటీయూ నాయకులు జోగు శేఖర్, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఏర్పుల వీరేషం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అనంగళ్ల అశోక్, ఏర్పుల బాస్కర్, పీఎన్ఎం రాష్ట్ర నాయకులు అనుపాటి గణేష్, కట్ట నరసింహ, నూతనగంటి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

# ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు పెన్షన్స్ పెంచాల్సిదే...

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు,పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ



**వికారాబాద్, మేజర్ న్యూస్ (జూలై 15 ):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం వృద్దులకు,వికలాంగులకు,వితంతువులకు పెంచన్స్ పెంచాల్సిదే అని పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్లో, వృద్ధులు వితంతువులు, వికలాంగులు మరియు ఒంటరి మహిళల సభలో, వికలాంగుల పెన్షన్ రూ. 6000 కు మరియు వృద్ధులు వితంతువుల పెన్షన్ రూ.4000 లకు పెంచాలని కండరాల బలహీనత తో బాధపడుతున్న వారికి రూ.పదిహేను వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్ నగరంలో జరగబోయే మహాధర్నను విజయవంతం చేసుకోవడంలో భాగంగా మంగళవారం స్థానిక వికారాబాద్ పట్టణంలో సన్నాక సదస్సు కు హాజరై మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకంటే ముందు వికలాంగుల పెన్షన్ను 6000 పెంచుతామని వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు కల్లుగీత కార్మికుల పెన్షన్ 2000 నుండి 4000 పెంచుతామని అదేవిధంగా కండరాలతో బాధపడుతున్న వారికి పదిహేను వేల పెన్షన్ ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 20 నెలలు గడిచిన బడ్జెట్ లేదని, నిధులు లేవని, సాకులు చెబుతూ తప్పించుకుంటుందని అన్నారు. ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎవరికి అవసరం లేని అందాల పోటీ నిర్వహించడానికి నిధులు ఉంటాయి!, వగైరా కార్యక్రమాలకు నిధులు ఉంటాయి కానీ... చేయూత పెన్షన్ దారులకు పెన్షన్ పెంచకుండా మూడు నాలుగు సంవత్సరాల నుండి భర్తలు చనిపోయిన వితంతువులకు వృద్ధులకు కొత్త పెన్షన్ ఇవ్వకుండా ఇంకను దాటవేస్తుందన్నారు. దాదాపుగా వారికి ఇవ్వాల్సిన రూ.20వేల కోట్ల విలువ చేసే పెన్షన్లను ఇవ్వకుండా తప్పించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్న సందర్భంగా ఎం ఆర్ పీఎస్ కచ్చితంగా వారందరినీ కూడగట్టుకొని ఆగస్టు 13న లక్షలాది మందితో మహా ధర్నా ప్రదర్శనను నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచి అర్హులందరికీ పెన్షన్ సాధించి పెడతామని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తెలియజేయడం జరిగింది.

గతంలో బియ్యం పథకం కోసం నాలుగు కిలోల నుండి ప్రతి మనిషికి ఆరు కిలోలు వచ్చే విధంగా ఉద్యమించిన ఘనత ఎమ్మార్పీఎస్ ది అదే విధంగా గతంలో వృద్ధులు వితంతువులు వికలాంగుల పెన్షన్స్ ఉద్యమించి పెంచినవే అని గుర్తు చేస్తూ కచ్చితంగా చేయూత పెన్షన్ల పెంపుదల కొత్త పెన్షన్లు మూడు సంవత్సరాలు నుంచి పెండింగ్ ఉన్న వాటిని సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ మాదిగ, జిల్లా ఇన్చార్జి ప్రశాంత్ మాదిగ, వి ఎచ్ పీఎస్ జిల్లా అధ్యక్షులు శ్యాంప్రసాద్, చేయూత పెన్షన్ల జిల్లా కమిటీ అధ్యక్షురాలు మంజుల,మహిళా నాయకురాలు పద్మమ్మ పుష్ప, సునీత, ఎం ఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఎం ఆర్ పీఎస్ ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



# ఆ నలుగురిపై రౌడీషీట్ ఓపెన్...: ఎస్ఐ శంకర్



బషీరాబాద్, మేజర్ న్యూస్ (జూలై 15) : బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవల్గా గ్రామంలో 2025 సంవత్సరం ఫిబ్రవరి 4న నవల్గా గ్రామ శివారులోని తాత గుడి వద్ద జరిగిన మాల శామప్ప(38) యొక్క హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నిందితులు అయినటువంటి మాల సుగుణమ్మ, మాల శివకుమార్( శివప్ప), కొత్త విజయకాంత్, విశ్వనాథ్ అను నేరస్థులు గతంలోని బషీరాబాద్ పోలీస్ వారు అరెస్ట్ చేసి అనంతరం జ్యుడీషియల్ రిమాండ్కు తరలించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎస్సై శంకర్పై అధికారుల ఆదేశాలు మేరకు భవిష్యత్తులో ఇటువంటి నేర చర్యలు పునరుతం కాకుండా చూసేందుకు పాత నేరస్థులైన వారిని నలుగురిపై నిఘా ఉంచడం కోసం హత్య కేసులో నిందితులుగా ఉన్నటువంటి పై నలుగురు వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేయడం బషీరాబాద్ ఎస్ఐ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.









# మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలి...

### ఎస్ఐ రవిగౌడ్

దౌల్తాబాద్, మేజర్ న్యూస్(జూలై 15):
మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై రవి గౌడ్ కోరారు.మండల పరిధిలోని గోకాపస్లబాద్ గ్రామంలో ఎస్పీ కే.నారాయణరెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా పోలీస్ కళాజత బృందంతో మాదకద్రవ్యాల పై ఎస్ఐ రవి గౌడ్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రవి గౌడ్ మాట్లాడుతూ.... యువత చెడు అలవాట్లకు ఆకర్షితులై వచ్చే నష్టాలు కుటుంబంలో మన తల్లిదండ్రులు మన కుటుంబీకులు పడే దుఃఖం అధికంగా ఉంటుందని తెలిపారు. యువత ముందు నుంచి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్ తో పాటు గుట్కా, గంజాయి మాదకద్రవ్యాలు ,సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆలోచన విధానం ఆలోచన శక్తి నశిస్తుందని తెలిపారు. యువత రోడ్డుపై తాగి డ్రైవింగ్ చేయరాదు అన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయరాదని తెలిపారు.గ్రామంలో బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098కు కాల్ చేయాలని తెలిపారు. రాత్రి సమయంలో సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉంది కావున వెంటనే 1930కు కాల్ చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరా ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం అని తెలిపారు. యువత ఆన్లైన్ బెట్టింగ్ తో మోసపోయి కుటుంబాలను రోడ్డుపాలు చేయొద్దని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్ఐ రవి



గౌడ్. పోలీస్ సిబ్బంది వెంకట్ రాములు. చంద్రశేఖర్ శ్రీనివాస్ గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు

### కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వార్ల సంతోష్కుమార్



**కొడంగల్, మేజర్న్యూస్ (జూలై 15):**
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వార్ల సంతోష్కుమార్ అన్నారు. కొడంగల్ మండలంలోని పాటిమీదిపల్లి గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుభాన్తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# లాల్ గడి మలక్ పేట మాలవాడలో నీటి సమస్య తీర్చండి సార్...

### కమిషనర్ చంద్రశేఖర్కు
### వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు...



కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

శామీర్ పేట,మేజర్ న్యూస్( జూలై 15)
గత నాలుగు నెలలుగా మా కాలనీలో మంచి నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అలియాబాద్ పురపాలక సంఘం లాల్ గడి మలక్ పేట మాలవాడ వాసులు మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.....

మా కాలనీలో 120 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, మంచినీరు సక్రమంగా రాకపోవడంతో మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికే పలుమార్లు అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కి పలుమార్లు ఫిర్యాదు చేయగా,అప్పుడు వాటర్ ట్యాంకర్ తో ఇంటికి ఒక డ్రమ్ము నీళ్లు పోశారు.కానీ మళ్లీ నీటి సమస్య మొదటికి వచ్చిందని, నీళ్లు రాకపోవడానికి ముఖ్య కారణం వాటర్ మ్యాన్ అని అతని వెంటనే మార్చాలని అన్నారు. మా కాలనీలో మూడు బోర్లు ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత పరిష్కారంగా 50వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మించి, నీటి సమస్యను తీర్చాలని కమిషనర్ ను కోరాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీ



**దోమ, మేజర్న్యూస్ (జులై 15)**ః దోమ మండల పరిధిలో రాకొండ గ్రామంలో మంగళవారం నాడు దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలి విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాకొండ కాంగ్రెస్ గ్రామ కమిటీనుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేష్ గౌడ్, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్రి తదితరులు పాల్గొన్నారు. రాకొండ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు : మజ్జిగ వెంకటయ్య ఉపాధ్యక్షులు .: బండి వెంకటయ్య, ఖాజమైనుదిన్,ప్రధాన కార్యదర్శి : చాపల శ్రీనివాస్కోశాధికారి: చంద్రయ్య సోషల్ మీడియా కన్వీనర్ : వడ్ల సురేందర్, సమన్వయకర్త : మురళీ కృష్ణ

# టాస్ పై పోస్టర్ ఆవిష్కరణ

**విద్యకు మరో అవకాశం - ఓపెన్ స్కూల్ ద్వారా జీవితంలో వెలుగు : కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్,జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (జూలై 15):** పాఠశాల విద్య మధ్యలో ఆపాల్సి వచ్చిన విద్యార్థులు, వయోజనులకు మరొక అవకాశం కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కార్యకలాపాలు సాగిస్తున్నాయని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో టాస్ పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "విద్య అనేది వయసుతో సంబంధం లేకుండా అందరికీ అవసరం. సాధికారతకు అది మార్గం. వ్యక్తిగత జీవితాన్ని మార్చే శక్తి విద్యలో ఉంది. టాస్ ద్వారా అందరికి మరో అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. దీన్ని విద్యార్హత కోల్పోయిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి'' అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారిణి కె. అనిత, టాస్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారిణి ఐ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు. పోస్టర్ ద్వారా టాస్ ప్రవేశాలు, అర్హతలు, పరీక్షల సమాచారం, నోటిఫికేషన్ వివరాలు మొదలైనవన్నీ స్పష్టంగా ప్రజలకు అందించేలా రూపొందించారని అధికారులు తెలిపారు. మండలాల వారీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఘట్‌కేసర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా రేసు లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జూలై, 15):** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో లయన్స్ క్లబ్ ఘట్‌కేసర్ అధ్యక్షులు లయన్ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో లయన్ రేసు లక్ష్మారెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత వైభవంగా వాసవి టవర్ లయన్స్ క్లబ్బు కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘట్‌కేసర్ కమ్యూనిటీ హాస్పిటల్లో పేషెంట్స్ కి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మునుముందు ఎన్నో సేవా కార్యక్రమాలను చేయదల్చామని లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ రేసు లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి చార్టర్ ప్రెసిడెంట్ వేముల కేశవనాదం గౌడ్, ఇన్చార్జి అశోక్ గుప్తా మహేందర్, మరియాల సందీప్, మహిళా లయన్ మెంబర్స్లయన్ శారదగౌడ్ గారు, లయన్ లావణ్య, లయన్ చందన, లయన్ దుర్గ, ఘట్‌కేసర్ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ బచ్చు ప్రమోద్ గుప్తా, కోశాధికారి లయన్ సన్నిధి కృష్ణ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ లయన్ హిమబిందు, మెంబర్షిప్ కమిటీ చైర్పర్సన్ లయన్ బచ్చు నగేష్ గుప్తా, లయన్ డాక్టర్ జంగయ్య, లయన్ రవిశంకర్, లయన్ బొట్టు కృపానిది, లయన్ మారం లక్ష్మారెడ్డి, లయన్ సిహెచ్ మహేందర్ రెడ్డి, లయన్ సయ్యద్ హమీద్, లయన్ కందకట్ల సుదర్శన్ రెడ్డి, లయన్ హరిబాబు, లయన్ శ్రీలక్ష్మి, లయన్ మాధవి పాల్గొన్నారు.






# బుద్ధునితో నా ప్రయాణం నాటకం ప్రదర్శన



**నల్లగొండ మేజర్‌న్యూస్:** బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మరియు పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలో గల కోటిరెడ్డి ఫంక్షన్ హాల్ లో అంబేద్కర్ జీవిత చరిత్ర ఆధారంగా " బుద్ధునితో నా ప్రయాణం" అనే నాటిక ను ప్రదర్శించారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సంకు హరి, నామ వెంకటేశ్వర్లు పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ మండల ఆంజనేయులు,కన్వీనర్ నూనె విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త నగేష్, కోశాధికారి గోలి మల్లేశం, సభ్యులు పాల్గొన్నారు.









## హిందుస్థాన్ పెట్రోలియం హెచ్ పిసిఎల్ ఆవరణలో మొక్కలు నాటిన డీలర్ విష్ణువర్ధన్ రెడ్డి




ఉచిత పైప్, స్టవ్ రిపేర్ చేస్తున్న హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ.

**దోమ, మేజర్ న్యూస్ (జులై 15):** 51 సంవత్సరాలు పూర్తి పూర్తయిన సందర్భంగాహిందుస్థాన్ పెట్రోలియం హెచ్‌పి సిఎల్ సంస్థ ఏర్పడి 51 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దోమ మండలంలో శ్రీ దత్త సాయి హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ వారు మంగళవారంనాడు వారి గోదాం పరిసర ప్రాంతంలో హరితహారం లో భాగంగా మొక్కలు నాటడం, అదేవిధంగా గ్రామ ప్రధాన కూడలిలో ఉచిత స్టవ్ రిపేర్ చేసే కార్యక్రమం వినియోగదారులను ఉద్దేశించి స్థానిక డీలర్ జి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వంట చేసే ప్రతి ఒక్కరూ గ్యాస్ పైప్ స్టవ్ ను ఎలా వినియోగించాలి అనే అంశాల పైన సురక్ష పైప్ స్టవ్ వాటిగురించి వినియోగదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గోదాం, డెలివరీ బాయ్స్, సత్తయ్య, శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## చీర్యాలలో శుభ్రత, పర్యావరణం, సంక్షేమంపై స్పెషల్ డ్రైవ్

**100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ చర్యలు వేగవంతం**



కీసర,మేజర్ న్యూస్ (జూలై 15):వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం దమ్మాయి గూడ మున్సిపల్ చీర్యాల వార్డు పరిధిలో డెంగ్యూ, మలేరియా నివారణ అవగాహన, తడి-పొడి చెత్త వేరు చేయడం, గృహ కంపోస్టింగ్, ప్లాస్టిక్ నివారణపై ర్యాలీలు నిర్వహించారు. వన మహోత్సవం సందర్భంగా 600 మొక్కలు పంపిణీ చేశారు.

సీ.సీ రోడ్డు మరమ్మతులు, రోడ్ల పక్కల చెత్త, పొదలు తొలగింపు, మురికిదారుల శుభ్రత, నాలాల పూడిక తొలగింపు చేపట్టారు. ఏబీసీ కార్యక్రమం, వాణిజ్య లైసెన్సుల తనిఖీలు, భువన్ యాప్ సర్వే, 683 మంది విద్యార్థులకు బ్యాగులు, చెప్పులు, యోగ మాట్స్ పంపిణీ చేశారు.మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్ రెడ్డి, మేనేజర్ వెంకటేషం, డీఈఈ బాలమురళి, మహిళా సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉమ్మడి శామీర్ పేట ప్రెస్ క్లబ్ సభ్యులకు సన్మానం...



ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిని సన్మానిస్తున్న గోనె హనుమంత రెడ్డి

**శామీర్ పేట,మేజర్ న్యూస్ (జూలై 15):**ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన ఉమ్మడి శామీర్ పేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు క్యాతం రవి, ఉపాధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ మరియు కార్యవర్గ సభ్యులను తెలంగాణ రాష్ట్ర ట్రస్మా ఉపాధ్యక్షులు గోనె హనుమంతు రెడ్డి, ఉమ్మడి శామీర్ పేట మండలం ట్రస్మా ప్రధాన కార్యదర్శి జే.కిష్టారెడ్డి మంగళవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలు పరిష్కార దిశగా వార్తలు రాయాలని సూచించారు.

**ఘనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుని పుట్టిన రోజు వేడుకలు** ప్రెస్ క్లబ్ అధ్యక్షులు క్యాతం రవి పుట్టినరోజు సందర్భంగా తోటి మీడియా మిత్రులు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సలహాదారులు వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులు బందెల ప్రభాకర్, బూడిద రవీందర్ గౌడ్, చిన్న,శ్రీనివాస్, శ్రవణ్, శ్రీహరి,టి. రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

